జెడ్‌పి చైర్‌పర్సన్‌ను కలిసిన సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్

ఏలూరు సిటీ : ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్‌ను ఆమె క్యాంపు కార్యాలయంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్‌గా నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన విలియమ్స్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో సివిల్ సప్లైస్ శాఖ ద్వారా చేపట్టబడుతున్న పథకాల అమలు, నాణ్యమైన బియ్యం సరఫరా, పౌరులకు సమయానుసారం సరుకుల అందుబాటు వంటి అంశాలపై చైర్‌పర్సన్ సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా పథకాలు అందాలని, ఎటువంటి లోపాలు లేకుండా నాణ్యతతో సరఫరా కొనసాగాలని సూచించారు. రానున్న నెలలో పండుగల దృష్ట్యా జిల్లాలో రేషన్ సరుకుల పంపిణీకి అవసరమైన ఏర్పాట్లు ముందుగానే చేయాలని, ప్రతి గ్రామంలో బియ్యం నాణ్యతపై నిరంతర పరిశీలన ఉండాలని చైర్‌పర్సన్ సూచించారు. ఈ సందర్భంగా విలియమ్స్ మాట్లాడుతూ శాఖ తరపున అన్నివిధాలా సహకారం అందిస్తానని తెలిపారు.

కొల్లేరుకు మోక్షం లేదా..!

- జూన్ 17,18 తేదీల్లో కేంద్ర సాధికారిక కమిటీ పర్యటన
- మూడు నెలలు దాటినా ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాలు కరువు
- కొల్లేరు సమస్యను పరిష్కరిస్తున్నామంటూ కూటమి నేతలు హడావుడి
- శాశ్వత పరిష్కారం చూపాలంటూ కొల్లేరు ప్రజల వేడుకోలు
- గడిచిన 19 ఏళ్లుగా పాతపాటే పాడుతున్న ప్రభుత్వాలు



కొల్లేరులో సాధికారిక కమిటీ పర్యటన (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కొల్లేరు సమస్యకు మోక్షం లభించేనా అంటూ అక్కడి ప్రజలు కళ్లుకాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. రోజులు గడిచిపోతున్నా ప్రభుత్వం నుంచి ఉలుకుపలుకూ లేకపోవడంపై కొల్లేరు ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపిస్తుందని కొల్లేరు ప్రాంత ఎంఎల్‌ఎలు, ఎంపీ అక్కడి ప్రజల్లో ఆశలు రేపారు. జూన్ 17, 18 తేదీల్లో కేంద్ర సాధికారిక కమిటీ కొల్లేరులో పర్యటించింది. కొల్లేరులోని 120 గ్రామాల ప్రజలు సాధికారిక కమిటీని కలిసి తమగోడు విన్పించారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, జిరాయతీ, సొసైటీ భూములను తిరిగి ఇవ్వాలని శాశ్వత పరిష్కారం చూపాలని వేడుకున్నారు. కూటమి ప్రజాప్రతినిధులు, ఇతర రాజకీయ పార్టీలు సైతం సాధికారిక కమిటీ సభ్యులకు కొల్లేరు సమస్యపై వినతులు అందించారు. రెండో రోజు జిల్లా కలెక్టరేట్‌లో కమిటీ నిర్వహించిన సమావేశానికి కొల్లేరు ప్రజలు పెద్దఎత్తున హాజరై తమ సమస్యలను వినతుల రూపంలో ఇచ్చారు. కొద్ది రోజుల్లోనే కొల్లేరు సమస్యకు పరిష్కారం దొరుకుతుందని కూటమి నేతలు ఊదరగొట్టారు. సాధికారిక కమిటీ పర్యటించి మూడు నెలలు దాటిపోయింది. ఇప్పటి వరకూ కొల్లేరు సమస్యపై ఒక్క అడుగూ ముందుకు పడిన దాఖలాలు లేవు. దీంతో గతంలో మాదిరిగానే ఇప్పుడు మోసపోయినట్లేనా అనే చర్చ కొల్లేరు ప్రజల్లో నడుస్తోంది. ఐదో కాంటూరు వరకూ ఉన్న కొల్లేరు సరస్సుకు సంబంధించి 77,138 ఎకరాల భూమి ఉంది. ఇందులో 14,932 ఎకరాలు జిరాయితీ భూమి, ఏడు వేల ఎకరాలు సొసైటీ భూములు ఉన్నాయి. 2006లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కొల్లేరుతో 43,724 ఎకరాల పరిధిలోని 1,776 చేపల చెరువులను బాంబులు పెట్టి మరీ ధ్వంసం చేశారు. జిరాయితీ, సొసైటీ భూముల్లోని చెరువులను సైతం నాశనం చేశారు. కొల్లేరు ప్రాంతంలో 120 గ్రామాలు ఉండగా మూడు లక్షలకుపైగా జనాభా నివశిస్తున్నారు. బిసి, ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన జనాభానే ఎక్కువ ఉన్నారు.

రోడ్డున పడ్డ కొల్లేరు ప్రజలు

ఆపరేషన్ కొల్లేరుతో అక్కడి ప్రజలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. చేపల చెరువుల ధ్వంసంతో సాగు చేసుకునేందుకు భూమి లేక ఉపాధి కోల్పోయి బతుకుదెరువు కోల్పోయారు. కడుపు నింపుకునేందుకు కేరళ, తమిళనాడు, ముంబై వంటి రాష్ట్రాలకు వలస వెళ్లి చేపల వేట చేసుకుంటూ నెట్టుకొస్తున్నారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, ఆ విధంగా చేస్తే 33,750 ఎకరాలు కొల్లేరు సరస్సుగా ఉంటుందని, మిగిలిన భూములను కొల్లేరు ప్రజలకు ఇవ్వాలని అక్కడి ప్రజలు 19 ఏళ్లుగా కోరుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు హామీలు ఇవ్వడం, గెలిచిన తర్వాత పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిపోయింది. దీంతో కొల్లేరు ప్రజలు నానావస్థలు పడుతున్నారు. 2014-19లో టిడిపి, బిజెపి కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. భీమవరంలో జరిగిన ఎన్నికల సభలో ప్రధాని మోడీ కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని హామీ ఇచ్చారు. గెలిచిన తర్వాత సర్వేల పేరుతో హడావుడి చేశారు. ధ్వంసం చేసిన జిరాయితీ భూములను తిరిగిస్తామని నమ్మబలికారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి సైతం కేంద్రానికి పంపించారు. తర్వాత పట్టించుకున్న దాఖలాల్లేవు. 2019లో వచ్చిన వైసిపి ప్రభుత్వం కొల్లేరు గురించి పట్టించుకున్న పరిస్థితి లేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతామని హడావుడి చేస్తుందే తప్ప చర్యలు మాత్రం కన్పించడం లేదు. కొల్లేరులో అటవీశాఖ నిబంధనల పేరుతో తాగునీరు, రోడ్లు సైతం ప్రజలకు అందకుండా పోయాయి. కొల్లేరు ప్రజలను ఆదుకోవాలని అక్కడి ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. 2014-19లో మాదిరిగానే హడావుడి చేసి వదిలేస్తారా.. కొల్లేరు సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందా అనే చర్చ కొల్లేరువాసుల్లో నడుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా త్వరితగతిన కొల్లేరు సమస్యను పరిష్కరించాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

నేవీ ఆయుధ డిపోను ఉపసంహరించాలి

ప్రజాసంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానం



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెంలో నిర్మించ తలపెట్టిన నేవీ ఆయుధ డిపోను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎస్.రామ్మోహన్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎపి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తెల్లం దుర్గారావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు కారం దారయ్య, రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు ఇ.భూషణం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవి, వెంకటేశ్వరరావు, రామ్మోహన్ మాట్లాడుతూ జీలుగుమిల్లి మండలం వంకవారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో వంకవారిగూడెం, దాట్లవారిగూడెం, మడకంవారిగూడెం, కొత్త చీమలవారిగూడెం, రమణక్కపేట గ్రామాల మధ్యలో జన నివాసాల నడుమ ఆయుధ డిపో నిర్మాణం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఏటా రెండు పంటలు పండుతున్న వ్యవసాయ భూములను నేవీ ఆయుధ డిపో నిర్మాణం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా సేకరించడం దుర్మార్గమన్నారు. సముద్ర తీరానికి 400 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలు, పేదలు వ్యతిరేకిస్తున్నా చట్ట విరుద్ధంగా నేవీ ఆయుధ డిపోను కూటమి ప్రభుత్వం ఏర్పాటుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. 2013 భూసేకరణ చట్టాన్ని ధిక్కరిస్తూ రాజ్యాంగంలో షెడ్యూల్ 5ని విస్మరిస్తూ, ఏజెన్సీలోని పీసా, 1/70 చట్టాలకు తూట్లు పొడుస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతుందని విమర్శించారు. అభివృద్ధి పేరుతో ఏజెన్సీ ప్రాంతంలో ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు తీసుకొచ్చి ఆదివాసీల గొంతు నొక్కుతూ వారి జీవితాలను ఛిద్రం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడవిలో స్వేచ్ఛగా బతికే గిరిజనులు ఈ ఆయుధ డిపో వస్తే అడుగడుగునా అడ్డంకులతో భూమి, ఉపాధి కోల్పోయి ఇతర ప్రాంతాలకు తరలిపోవాల్సి వస్తుందన్నారు. ఇప్పటికే పోలవరం నియోజకవర్గంలో పోలవరం ప్రాజెక్ట్, జల్లేరు రిజర్వాయర్, జాతీయ రహదారి, బొగ్గు గనుల పేరిట అడవి అంతరిస్తోందని, దీంతో ఆదివాసీలు నిర్వాసితులుగా మారే ప్రమాదం ఉందని అన్నారు. ఏలూరు జిల్లాలోని కొద్దిపాటి ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలను ఇరుకుగదుల్లో కుక్కినట్లు చేసి గిరిజన చట్టాలను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు పీసా గ్రామసభల ద్వారా ఏకగ్రీవంగా తిరస్కరించిన నేవీ ఆయుధ డిపోను నిలిపివేయాలని, తక్షణం భూసేకరణ ఆపాలని కోరారు. ఆయుధ డిపోను అటవీ లేదా పంటలు పండని మరో ప్రాంతానికి తరలించాలన్నారు. ఆదివాసీల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెండు పంటలు పండుతున్న గిరిజనులు, పేదల భూములను బలవంతంగా సేకరించడం ఆపాలని, ఎంపీ, ఎంఎల్ఏ, జిల్లా కలెక్టర్ ఉన్నత స్థానాల్లో ఉండి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తీర్మానాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రవేశపెట్టగా, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు సాలి రాజశేఖర్, ఎఐటియుసి జిల్లా నాయకులు కన్నబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి జె.గోపి, ఆదివాసీ సేన రాష్ట్ర అధ్యక్షులు మడకం వెంకటేశ్వరరావు, ఎన్ఎఫ్ఐడబ్ల్యు నేత బి.శ్యామల, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి నాని, బికెఎన్‌యు జిల్లా నాయకులు ప్రభాకర్‌రావు, ఎఐకెఎంఎస్ నాయకులు సుందరరావు, రైతుకూలీ సంఘం నాయకులు భాస్కరరావు, రమణక్కపేట గ్రామ నాయకులు తెల్లం శంకరుడు, దాట్లవారిగూడెం గ్రామ నాయకులు కారం నాగదుర్గ తదితరులు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఆయుధ డిపో నిర్మాణానికి పూనుకుందన్నారు. అప్పుడే ప్రజలు రెండుసార్లు పీసా గ్రామసభలు జరిపి అంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారని గుర్తు చేశారు. నాడు టిడిపి నేతలతోపాటు జనసేన నేత, ప్రస్తుత ఎంఎల్ఏ బాలరాజు సైతం దీన్ని వ్యతిరేకించారని గుర్తు చేశారు. నాడు తప్పయిది.. నేడు ఎలా ఒప్పవుతుందో ప్రజాప్రతినిధులే చెప్పాలని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరోసారి పీసా గ్రామ సభ జరిపిన ప్రజలు గతంలో వలె తీవ్రంగా వ్యతిరేకించారని తెలిపారు. ఈ గ్రామ సభలో స్థానిక ఎంఎల్ఏ చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు సైతం పాల్గొన్నారని తెలిపారు. దీంతో ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ఆయుధడిపో పెట్టబోమని ఎంపీ ప్రకటించారని తెలిపారు. నేడు ఎంపీ మాటమార్చి స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి, పూర్తిస్థాయి పునరావాసం కల్పిస్తామని చెప్పడం ఆదివాసీలకు అన్యాయం చేయడమేనన్నారు. ఈ ఆయుధడిపో ద్వారా ప్రత్యక్షంగా రెండు వేల మందికి, పరోక్షంగా పది వేల మందికి ఉపాధి దొరుకుతుందని అంకెల గారడీ చేస్తున్నారని విమర్శించారు. ఈ డిపో నిర్మాణం కోసం 1166 ఎకరాలు భూసేకరణ చేశామని కలెక్టర్, ఎంపీ, ఎంఎల్ఏ ప్రకటించడం దుర్మార్గమన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతంలో పీసా చట్ట ప్రకారం గ్రామసభల ఆమోదం లేకుండా భూసేకరణ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. ఆదివాసీల త్యాగాలతో చేపట్టిన జాతీయ ప్రాజెక్టు పోలవరం ఇప్పటికీ పూర్తి కాలేదని, నేటికీ 88 శాతం మందికి పరిహారం, భూమికి భూమి, పునరావాసం కల్పించలేదని ప్రభుత్వమే ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొండిగా ఆయుధ డిపో పెట్టి తీరుతామని ప్రకటించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు. సమావేశంలో గిరిజన, వ్యవసాయ కార్మిక, రైతు కూలీ, కార్మిక సంఘాల నాయకులు ఎస్.రాజశేఖర్, ఎస్.సత్యం, సత్యనారాయణ, మరో 20 మంది ప్రజాసంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరికి కొనసాగుతున్న వరద

గుండేటి, పాలవాగు, ఎద్దువాగు కాజ్ వేలు మునక

పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



కుకునూరు-దాచారం ప్రధాన రహదారిపైకి గోదావరి వరద

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని దిగువకు వదలడంతో గోదావరి వరద నీరు పోటెత్తుతుంది. ఇప్పటికే గత మూడు రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్ వే పైకి వరదనీరు చేరడంతో వాగు అవతల ఉన్న 12 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. గోదావరికి వరద ఉధృతి కొనసాగుతుండడంతో ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్ వే పైకి వరదనీరు చేరడంతో మూడు గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. భద్రాచలంలో శుక్రవారం నాడు 44 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం శనివారం ఉదయం 46.9 అడుగులకు చేరి స్వల్పంగా తగ్గుముఖం పట్టి సాయంత్రానికి 45 అడుగులకు చేరుకుంది. భద్రాచలంలో గోదావరి స్వల్పంగా తగ్గినా మండలంలో క్రమంగా పెరుగుతుంది. దీంతో మండలంలో మిర్చి పంట సాగుచేసిన రైతులకు తీవ్ర నష్టం జరుగుతుంది.

వేలేరుపాడు రూరల్ : వేలేరుపాడు నుంచి రుద్రంకోట, రేపాక గొమ్ము ప్రధాన రహదారులు నీట మునగడంతో ఆయా గ్రామాల్లోని ప్రజలను అధికారులు పడవపై దాటిస్తున్నారు. వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలో వేలేరుపాడుకు దగ్గరలోని శుద్ధ గుంపు వద్ద రహదారి నీట మునగడంతో కన్నాయిగుట్ట, తిర్లాపురం, నాల్లారం పడమటి మెట్ట తదితర గ్రామాల ప్రజలు భూదేవిపేట మీదుగా సుమారు ఎనిమిది కిలోమీటర్లు తిరిగి వెళుతున్నారు. ఎడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు కాజ్ వే నీట మునిగే ఉండడంతో టేకూరు, కోయిదా, కట్కూరు, కాకిసినూరు తదితర సుమారు 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో కొన్నిరోజులుగా రహదారి సౌకర్యం లేక జలదిగ్బంధంలో చిక్కుకుని బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల వరి, ప్రత్తి, మిరప తోటలు వేసిన రైతులు పొలాల్లోనికి వరద నీరు చేరడంతో కన్నీరుమున్నీరవుతున్నారు.

దిగువకు 10,13,149 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం : పోలవరం ప్రాజెక్టు నుంచి 10,13,149 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జలవనరులశాఖాధికారులు తెలిపారు. ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 32.730 మీటర్లు, స్పిల్ దిగువల 24.100 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 33.450 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 23.660 మీటర్లు, ఎగువ దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 16.010 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం 12.180 మీటర్లు నమోదైనట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. కడమ్మ స్లూయిజ్ గేట్లు పూర్తిగా నీట మునగడంతో గేట్లు మూసుకుపోయి ఏటిగట్టు కుడివైపున ఉన్న కొండవాగుల జలాల్లో పంటపొలాలు నీటమునిగి ఉన్నాయి. గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పోలవరం, పురుషోత్తపట్నం రేవు లాంచి సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేశారు.

స్పిల్ వే వద్ద విడుదల అవుతున్న నీరు

మేజర్ కోర్సుగా బిఎ పొలిటికల్ సైన్స్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బిఎ హిస్టరీతో పాటు విద్యార్థుల అభ్యర్థన మేరకు బిఎ పొలిటికల్ సైన్స్‌ను కూడా ఒక మేజర్ కోర్సుగా మంజూరు చేసినట్లు కళాశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి సమాచారం అందిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిఎ పొలిటికల్ సైన్స్‌లో చేరాలనుకున్న విద్యార్థులు రెండో విడత ప్రవేశాల్లో భాగంగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. మిగిలిన వివరాలకు కోటదిబ్బలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

ఫలించిన పోరాటం : ఎస్ఎఫ్ఐ

ఎస్ఎఫ్ఐ విద్యార్థుల పోరాట ఫలితంగా గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో బిఎ పొలిటికల్ కోర్స్ వచ్చినట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో లెనిన్ మీడియాతో మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొన్ని రోజులుగా బిఎ పొలిటికల్ గ్రూపు మేజర్ సబ్జెక్టుగా ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు పోరాటం చేశారని, దానిలో భాగంగా సెకండ్ కౌన్సెలింగ్‌లో ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బిఎ పొలిటికల్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా ఇవ్వాలని హయ్యర్ ఎడ్యుకేషన్ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ఈ పోరాటానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించిన హయర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.వంశీ, కె.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ శాఖ విస్తీర్ణాన్ని పెంచాలి

జిల్లా ఇన్‌ఛార్జి అటవీ శాఖాధికారి సతీష్‌రెడ్డి

జీలుగుమిల్లి : అటవీ శాఖలో ఖాళీగా ఉన్న భూముల్లో ప్లాంటేషన్లు వేసి అటవీ శాఖ విస్తీర్ణాన్ని పెంచాలని జిల్లా అటవీ శాఖాధికారి జి.సతీష్‌రెడ్డి తెలిపారు. ములగలంపల్లి బీట్ రౌతుగూడెం విఎస్ఎస్ పరిధిలోని అటవీ శాఖ ప్రాంతంలో 2025లో నూతనంగా నాటిన ప్లాంటేషన్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్లాంటేషన్‌కు సంబంధించి రికార్డ్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. ప్లాంటేషన్‌లో మొక్కలు సజావుగా పెరుగుతుండటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ శాఖ పరిధిలో ఉన్న ప్లాంటేషన్‌లను వృద్ధి చేసి అటవీ శాఖను విస్తరింప చేయాలన్నారు. అటవీ శాఖ పరిధిలో ఉన్న ఖాళీ భూములను గుర్తించి నూతన ప్లాంటేషన్లు వేయాలని అటవీ శాఖ సిబ్బందికి ఆదేశించారు. సెక్షన్ అధికారి కె.రాంబాబు, జంగారెడ్డిగూడెం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గాకుమార్, బీట్ అధికార్లు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టానికి తూట్లు

ప్రభుత్వ విద్యాసంస్థల్లో సౌకర్యాలు కల్పించని కూటమి ప్రభుత్వం

విద్యార్థినుల పట్ల వివక్ష తగదు

సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతర పోరు

విద్యార్థినుల రాష్ట్రస్థాయి కన్వెన్షన్‌లో నేతలు

ముగింపు సందర్భంగా పట్టణంలో భారీ ప్రదర్శన

భీమవరంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ప్రదర్శన

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన కూటమి ప్రభుత్వం ప్రయివేటీకరణకు మొగ్గు చూపుతోంది. విద్యాహక్కు చట్టానికి పూర్తిగా తూట్లు పొడిచి నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేని దుస్థితి క్షేత్రస్థాయిలో కన్పిస్తోంది. మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కూడా కల్పించలేని పరిస్థితుల్లో పాలకులు ఉన్నారు. ఒకవైపు నాణ్యమైన విద్య అందక, మరోవైపు కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర విద్యార్థినుల కన్వెన్షన్ పిలుపునిచ్చింది. సమస్యలతో సతమతమవుతున్న విద్యార్థులను సంఘటిత పర్చి కదంతొక్కుతామని ప్రకటించింది. సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు కార్యాచరణ రూపొందించింది. ముఖ్యంగా అనేక రూపాల్లో నిరంతరం వివక్షకు గురవుతున్న విద్యార్థినుల కష్టాలపై విద్యార్థినుల కన్వెన్షన్ గళమెత్తింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థి సంఘ నేతలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీ ఘోష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రామ్మోహన్, ప్రసన్నకుమార్ మాట్లాడుతూ భవిష్యత్తు పోరాటాలుపై విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రాష్ట్ర విద్యార్థినుల కన్వెన్షన్ ముగింపులో భాగంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో భీమవరంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 300 మంది విద్యార్థినులు, విద్యార్థి సంఘ నేతలు ప్రదర్శనలో పాల్గొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లో ప్రారంభమైన ప్రదర్శన గాంధీ చౌక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ప్రకాశం చౌక్ వరకూ సాగింది. అక్కడ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి ఐషీఘోష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్నకుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోలీస్ బొమ్మ సెంటర్, అన్నపూర్ణ థియేటర్ రోడ్డు, కొత్త బస్టాండ్ సెంటర్ మీదగా వీరమ్మ పార్క్ మీదుగా అంబేద్కర్ భవనం వరకు ప్రదర్శన సాగింది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమాల్లో భాగస్వాములై భవిష్యత్ ఉద్యమాలకు రూపకల్పన చేసిన పలువురు విద్యార్థి నేతలను ప్రజాశక్తి పలుకరించింది. ఆ విషయాలు వారి మాటల్లోనే..

మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

సిహెచ్.పావని, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు

అధికారంలో ఉన్న నాయకులు తప్పు చేస్తే శిక్షించే పరిస్థితి లేదు. మహిళా చట్టాలన్నీ సామాన్యులకు ఒకలా, అధికార నాయకులకు మరోలా అమలు చేస్తున్నారు. అందరికీ చట్టాలు ఒకేలా అమలు చేసినప్పుడే సమాన న్యాయం అందుతుంది. అత్యా చారాలు, దాడులు ఆగాలంటే ప్రభుత్వంలో బిజెపి నాయకులు తప్పు చేస్తే వారిపైనా కచ్చితంగా చర్యలు తీసుకోవాలి. అలాంటిప్పుడే చట్టాలు అందరికీ సమానంగా అమలైనట్లు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ఇంట్లో సమానత్వంతో చూడాలి. అది చదువులోనే కాదు.. జాగ్రత్తలు చెప్పే విషయంలోనూ పిల్లల్ని సమానంగా చూస్తేనే ఇటువంటి హత్యలు, అత్యాచారాలకు ఆడ పిల్లలు భయపడే పరిస్థితి ఉండదు. తల్లిదండ్రులు ఆడ పిల్లలను తక్కువ భావనతో చూడటం మానేసి మగ పిల్లలతో సమానంగా పెంచాలి.

గిరిజన బాలికల హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలి

ఆర్.శిరీష, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు

శ్రీకాకుళం నుండి ఏలూరు వరకు గిరిజన ప్రాంతం విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థినుల సంఖ్య పెరుగుతుంది. వారి విద్య అవసరాలు తీర్చేం దుకు ప్రభుత్వం ఎక్కువ సంఖ్యలో విద్యాసం స్థలు నెల కొల్పాలి. వాటిలో మౌలిక సదుపాయాలన్నీ కల్పిం చాలి. విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా హాస్టళ్లు లేకపో వడం గిరిజన విద్యార్థినుల దురదృష్టంగా భావించాలి. ప్రభుత్వం వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, సిబ్బందిని నియమించాలి.

శానిటరీ నాప్కిన్స్ ప్రభుత్వం ఉచితంగా ఇవ్వాలి

నవిత, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు

రాష్ట్రంలో ప్రస్తుతం అందిస్తున్న శానిటరీ నాప్కిన్స్ నాణ్యత లేని పరిస్థితి ఉంది. దీంతో విద్యార్థినులు అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వం దీన్ని దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన శానిటరీ నాప్కిన్స్ అందజేయాలి. ఇది అన్నిచోట్లా అమలు చేయాలి. ప్రభుత్వం విద్యార్థినుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిష్కారానికి కృషి చేయాలి.

పౌష్టికాహారం అందించాలి

జ్యోతి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు

రాష్ట్రంలో అనేక హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. దీనివల్ల మరుగుదొడ్ల వసతి సరిగా లేని పరిస్థితి. ఫలితంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆడ పిల్లలకు పౌష్టికాహారం ఎంతో అవసరం. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు లేకపోవడం వల్ల హాస్టళ్లలో పౌష్టికాహారం అందట్లేదు. దీంతో విద్యార్థినులు శారీరకంగా బలహీనపడుతున్నారు. విద్యార్థినుల ఆరోగ్యానికి పెద్దపీట వేసేలా పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో హాస్టళ్లలో సౌకర్యాలు కల్పనకు కృషి చేయాలి.

1న పెన్షన్ల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను అక్టోబర్ ఒకటో తేదీన పంపిణీ చేసేందుకు అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి శనివారం సాయంత్రం సామాజిక పెన్షన్ల పంపిణీ, సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌పై ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబానికీ అవగాహన కార్యక్రమాలపై ఎంపిడిఒలతో కలెక్టర్ టెలీకాన్ఫెరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన బ్యాంకులకు సెలవు కారణంగా ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీకి ఎటువంటి ఆటంకం కలగకుండా 29వ తేదీనే పెన్షన్ల సొమ్ము మొత్తాన్ని బ్యాంకుల నుంచి తీసుకోవాలన్నారు. అక్టోబర్ నెల పింఛను చెల్లింపులు అక్టోబర్ ఒకటో తేదీ బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. అనివార్య కారణాలు వల్ల ఆరోజు పెన్షన్లు తీసుకొని వారికి సెప్టెంబర్ రెండో తేదీన పంపిణీ చేయాలన్నారు. జిల్లాలో సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బందితో పెన్షన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పింఛను పొందేందుకు పింఛను దారులు సచివాలయ సిబ్బంది ద్వారా వారి సంబంధిత ఇళ్లలో అందుబాటులో ఉండేలా ముందస్తు సమాచారం అందించాలన్నారు.

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

బలవంతపు విధులు వద్దు

మా సమస్యలు పరిష్కరించాలి

ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

సెలవులు, ఆదివారాల్లో చేయిస్తున్న బలవంతపు విధుల నుంచి తమకు విముక్తి కల్పించాలని ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరులోని మున్సిపల్ కార్యాలయంలో ఎపి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి, పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఎఎస్ ద్వారా ఆరేళ్ల స్పెషల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, తమ మనోభావాలు దెబ్బతీసే విధంగా చేయిస్తున్న వాలంటీర్ విధుల నుంచి వెంటనే విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సచివాలయ ఉద్యోగులను ఎవరి మాతృశాఖలో వారిని విలీనం చేయాలని, సీనియారిటీ జాబితా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల జెఎసి వైస్ ప్రెసిడెంట్ జివి.శ్రీనివాస్, సభ్యులు కడిమి అబ్రహం, శ్యామ్, సౌజన్య, ప్రసన్నలక్ష్మి, తేజ శ్రీనివాస్, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సొసైటీకి రూ.7.50 కోట్ల ఎల్ఒసి

ప్రజాశక్తి - చింతలపూడి

మాట్లాడుతున్న చంద్రశేఖర్

సెంట్రల్ బ్యాంక్ నుంచి క్రాప్ లోన్స్, ఎల్‌టి లోన్స్ రూ.7.50 కోట్ల ఎల్ఒసి డిసిసిబి ఛైర్మన్ గన్ని వీరంజనేయులు ఇచ్చారని యర్రంపల్లి సొసైటీ ఛైర్మన్ తాళ్లూరి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన ఎర్రంపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సూచన మేరకు ఎర్రంపల్లిలో నూతన సొసైటీ బ్యాంకు బిల్డింగ్ నిర్మించాలని ఎఎంసి మాజీ ఛైర్మన్ ముత్తా రెడ్డి, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ జంగా చెన్నకేశవరెడ్డి, మాజీ ఉపాధ్యక్షులు చిలుకూరు సుధీర్‌రెడ్డి, కనుమత రెడ్డి రాజా రెడ్డి కోరారు.

నోట్ –యాడ్ పర్పస్

నేడు వాడవల్లి సొసైటీ భవనం ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

సొసైటీ భవనం

మండలంలోని వాడవల్లి పిఎసిఎస్ సంఘ నూతన భవనం, ఎరువుల గిడ్డంగి ఆదివారం ప్రారంభించనున్నారు. ఏలూరు ఎంపీ మహేష్ కుమార్, కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ ఎన్.రఘురాం, ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో పాటు కూటమి నాయకులు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరుకానున్నట్లు సొసైటీ ఛైర్మన్ ఎం.గోవర్ధన్‌రావు, సంఘ సిఇఒ కె.నాగమునీంద్రరరావు శనివారం తెలిపారు. సుమారు రూ.37 లక్షల సంఘ నిధులతో సొసైటీ భవనాన్ని నిర్మించారు. 2024-2025 సంవత్సరానికి ఈ సొసైటీ నూరు శాతం రుణాలను వసూలు చేసింది. ఎరువుల నిల్వకు గిడ్డంగి కూడా అనువుగా ఉండే విధంగా నిర్మించారు.

ఆకట్టుకున్న మంజుశ్రీ కూచిపూడి భరతనాట్యం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని రామచంద్రపురం గ్రామంలో దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా శ్రీ కోదండ రామాలయం వద్ద మంజుశ్రీ కూచిపూడి భరతనాట్య ప్రదర్శన ఆకట్టుకుందని పలువురు పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా మంజుశ్రీని కమిటీ సభ్యులు, గౌరవ అధ్యక్షులు పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కృష్ణకిషోర్, అధ్యక్షులు మోతుకూరి నారాయణరావు, ఉపాధ్యక్షులు వరికూటి ధర్మారావు, కోశాధికారి సురేష్, కో-ఆర్డినేటర్ పువ్వాడ విజయ రవీంద్రబాబు, సభ్యులు తలారి సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు. మంజుశ్రీని, తల్లిదండ్రులను శాలువా, చిరు బహుమతితో సత్కరించారు.

29న మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

బుట్టాయగూడెం సిహెచ్‌సిలో ఈ నెల 29వ తేదీ సోమవారం స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియన్ కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో బిపి, షుగర్, గర్భిణులకు సంరక్షణ, రక్తహీనత, కేన్సర్ స్క్రీనింగ్, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు, పోషణ, శిశు అభివృద్ధి కార్యక్రమం, క్షయ వ్యాధి స్క్రీనింగ్, మహిళలకు హెల్త్ చెకప్‌లు, చెవి ముక్కు దంత వైద్య సేవలు, అందించనున్నట్లు సిహెచ్‌సి సూపరింటెండెంట్ వసుంధర తెలిపారు. కార్యక్రమానికి ఏలూరు నుంచి స్పెషల్ డాక్టర్స్ వచ్చినట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చింతలపూడి : చింతలపూడి ఏరియా ప్రభుత్వాసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఎఎంసి చైర్‌పర్సన్ చీదరాల దుర్గాపార్వతి, ఏలూరు డిసిహెచ్‌ఎస్ పాల్ సతీష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ అభివృద్ధి కమిటీ మెంబర్ కొండ్రు దేవభారతి, సూపరింటెండెంట్ నారాయణరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

కూటమి ప్రభుత్వం దాడుల్లో వైసిపి కార్యకర్తలు అన్యాయానికి గరయ్యారని, వారికి అండగా నిలబడేందుకు, అన్యాయాలను, వేధింపులను నమోదు చేసేందుకు డిజిటల్ బుక్‌ను ప్రారంభించినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు తెలిపారు. వైసిపి జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న దుర్మార్గపు పాలనపై, అదేవిధంగా వైసిపి కార్యకర్తలపై, నాయకులపై జరుగుతున్న దాడులు, అక్రమ కేసులు, రెడ్‌బుక్ అంటూ బెదిరిస్తున్న ప్రభుత్వ నాయకులపై వైసిపి అధికారంలోకొచ్చిన వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతిఒక్కరూ డిజిటల్ బుక్ యాప్‌ను మొబైల్‌లో నమోదు చేసుకుని, కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి చేసిన దుశ్చర్యలను అందులో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదేవిధంగా ఐవిఆర్‌ఎస్ నెంబర్ 040 -49171718 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే బాధితులందరికీ అండగా నిలబడి వారికి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మామిళ్లపల్లి జయప్రకాష్, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం గ్రామ శివారులో శనివారం సాయంత్రం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5640 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అలజడి.. ఆందోళన..!

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీనికి నిదర్శనం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల ప్రజల్లో ఈ కాలంలో ఆందోళనే నిదర్శనం. ఏజెన్సీలో నేవీ ఆయుధ డిపో, పోలవరం నిర్వాసితులకు భూసేకరణ, మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశాలు రెండు జిల్లాల ప్రజల్లో కలకలం రేపుతున్నాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఆయా అంశాలపై ప్రజాందోళలనలను అణచివేయడానికి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏరుదాటాక తెప్ప తగలేసిన చందంగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పశ్చిమ ఏజెన్సీ రాష్ట్రంలోనే అతి చిన్న ఐటిడిఎ పరిధి కలిగిన ప్రాంతం. అయితే ప్రాజెక్టు నిర్మాణంతో దీనిలో ఎక్కువ భాగం ముంపునకు గురవుతోంది. అక్కడి నిర్వాసితులకు సైతం ఇక్కడి ఏజెన్సీ ప్రాంతంలోనే పునరావాసం కల్పిస్తున్నారు. దీంతో అటవీ ప్రాంతం గణనీయంగా తగ్గిపోతుంది. ఈ క్రమంలో అటవీ విస్తీర్ణం పెంపునకు చర్యలు తీసుకోవాల్సిన పాలకులు, అధికారులు దానికి భిన్నంగా ఏజెన్సీలోనే ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రయత్నించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఎందుకంటే ప్రస్తుతం ఆయుధ డిపో ఏర్పాటుకు సుమారు వెయ్యి ఎకరాలకు పైగా భూసేకరణకు కసరత్తు ప్రారంభించారు. తర్వాత మరిన్ని అవసరాల రీత్యా మరికొంత భూమి కావాలని నేవీ అధికారులు కోరితే అక్కడే భూసేకరణ తప్పనిసరి. దీనివల్ల వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలు నిర్వాసిత గ్రామాలుగా మారనున్నాయి. ఆయుధ డిపో ఏర్పాటుతో గిరిజన ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఎంపీ, ఎంఎల్ఎ పదేపదే చెబుతున్నారు. ఇదే ఎంఎల్ఎ చిర్రి బాలరాజు గతంలో జనసేన నేతగా వైసిపి ప్రభుత్వ హయాంలో ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ గళమెత్తారు. నాడు గ్రామసభ తీర్మానాల మేరకు వైసిపి ప్రభుత్వం ఆయుధ డిపో ఏర్పాటుపై వెనుకడుగు వేసింది. కూటమి అధికారం చేపట్టాక కూడా మరోసారి ఆయుధ డిపో ఏర్పాటు ప్రతిపాదన తెరపైకి రాగా గ్రామసభ ముచ్చటగా మూడోసారి ఆ ప్రతిపాదనను తిరస్కరిస్తూ తీర్మానం చేసింది. ఫలితంగా గిరిజనుల అభీష్టానికి భిన్నంగా ఎటువంటి నిర్ణయం తీసుకోబోమని నాడు ఎంపీ, ఎంఎల్ఎ స్వయంగా ప్రకటించారు కూడా. మళ్లీ హఠాత్తుగా నేవీ ఆయుధ డిపోను తెరపైకి తీసుకురావడమే కాక ఇదేమిటని ప్రశ్నించినా, ఆయుధ డిపో మాకొద్దు అని అధికారులకు వినతి ఇద్దామన్నా కుదరదంటూ పోలీసు నిర్బంధం ప్రయోగించడం గమనార్హం. మడకంవారిగూడెం నుంచి గిరిజనులు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి తహశీల్దార్‌కు వినతిపత్రం అందిద్దామంటే పోలీసులు ఆ గ్రామం దాటకుండానే అడుగడుగునా నిర్బంధం ప్రయోగించి బల ప్రయోగానికి దిగారు. ర్యాలీ తహశీల్దార్ కార్యాలయం వరకూ వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకున్నారుగాని, గిరిజన మహిళల పోరాట పటిమ అందరిలో స్ఫూర్తి నింపింది.

ఇక ఏజెన్సీ చట్టాల ప్రకారం గ్రామసభ తీర్మానానికి అత్యంత ప్రాధాన్యత ఉంది. అయితే వాటన్నింటినీ బేఖాతరు చేస్తూ ప్రజాప్రతినిధులు ముందుకెళ్తుంటే చట్టరీత్యా సరికాదని చెప్పాల్సిన జిల్లా అధికారులు సైతం వారికి వంతపాడటం చర్చనీయాంశమైంది. ఆయుధ డిపో వంకావారిగూడెం పంచాయతీ పరిధిలో ఏర్పాటైతే ఉపాధి దక్కేది చాలా స్వల్పమే. ఆ ప్రాంత అభివృద్ధి కూడా మాటలకే తప్ప కార్యరూపంలో కన్పించదనేది వాస్తవం. ఈ రీత్యా ఏజెన్సీ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు భిన్నంగా వెళ్లేకంటే చింతలపూడి నియోజకవర్గంలో పెద్దల చేతిలో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఆయుధ డిపో పెట్టుకోవడం మంచిదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా గిరిజనుల, గిరిజన ప్రాంత అభివృద్ధిపై ఎంపీ, ఎంఎల్ఎకు చిత్తశుద్ధి ఉంటే ఐటిడిఎ ద్వారా గిరిజనులను ఉపాధి కల్పన, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చు. అయితే గిరిజన దినోత్సవం సందర్భంగా మినహా ఇప్పటి వరకూ మిగిలిన సందర్భాల్లో ఆయా ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సైతం ఐటిడిఎ వైపు కన్నెత్తి చూసిన దాఖలాల్లేవు. అడవి బిడ్డలపై అంత మమకారం ఉంటే రెడ్డిగణపవరం వద్ద కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మాణం లేక తాతాల్కికంగానైనా ఆ కాజ్‌వేను పునర్నిర్మించడమో చేయాలి. అలాగే ఏజెన్సీలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వైద్యశాలల పరిస్థితి అందరికీ తెలిసిందే. వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతుంటే, వైద్యశాలల్లో కొన్నింటిలో వసతులు లేవు, వైద్యులు, సిబ్బంది లేక ఆదివాసీలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రాథమిక అంశాలపై దృష్టి పెట్టకుండా ఆదివాసీల అభ్యున్నతి కోసమే ఆయుధ డిపో అంటే గిరిజనులు నమ్మే పరిస్థితి లేదు. ఎందుకంటే పోలవరం నిర్వాసితుల పరిస్థితి అందరికీ కళ్ల ముందు కట్టినట్లు కన్పిస్తోంది. పరిహారం, పునరావాసం రెండింటిలోనూ నిర్వాసితులైన గిరిజనులకు నేటికీ న్యాయం జరగని పరిస్థితి. వాళ్లకు ముందు న్యాయం చేసి ఆపై ఆయుధ డిపో ఏర్పాటుపై చర్చిస్తే మంచిదని పలువురు పరిశీలకులు సైతం పాలకులకు, అధికారులకు సూచిస్తున్నారు.

అల్లూరి జిల్లాలోని పోలవరం నిర్వాసితులకు పునరావాసం, భూమికి భూమి ఇచ్చేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో భూసేకరణ చేస్తున్నారు. అదీ వివాదాల్లో ఉన్న భూములను గిరిజనేతర భూస్వాముల పేరున రికార్డుల్లో చూపి వారికి సొమ్ము దక్కేటట్లు అధికారులు పావులు కదుపుతుండటం, దానిపై ఎంపీ, ఎంఎల్ఎ నోరు మెదపకపోవడం అంతా తెలిసే జరుగుతుందనేది అర్థమవుతోంది. ఇప్పటికైనా వారు ఏజెన్సీ చట్టాలకు భిన్నంగా గిరిజనులకు దక్కాల్సిన భూములను గిరిజనేతర భూస్వాముల నుంచి భూసేకరణ పేరుతో సేకరిస్తే కచ్చితంగా గిరిజనులకు అన్యాయం చేసిన వారవుతారని అంతా ఘంటాపథంగా చెబుతున్నారు. నిజంగా గిరిజనుల, గిరిజన ప్రాంత అభివృద్ధిపై ప్రేమ ఉంటే పోలవరం నిర్వాసితులకు చట్టప్రకారం పరిహారం, పునరావాసం కల్పించడంతోపాటు భూసేకరణలో అక్రమాలను అరికట్టాలని అంతా కోరుతున్నారు.

ఇక మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ అంశం పశ్చిమలో చర్చనీయాంశమైంది. ఒక్కగానొక్క మెడికల్ కళాశాల పాలకొల్లు సమీపంలోని దగ్గులూరులో నిర్మాణ దశలో ఉంది. పిపిపి పద్ధతిలో ఇది చేపడితే ప్రభుత్వ పెద్దలు చెబుతున్నట్లు 31 ఏళ్ల వరకూ ప్రయివేటు యాజమాన్యం చేతిలో ఉంటుంది. తర్వాత రాజెవరో, బంటెవరో అన్నట్లు అప్పటి నిర్ణయాలు ఎలా ఉంటాయో ఊహించనక్కర్లేదు. అంటే వైద్య విద్య మన జిల్లాలో అందుబాటులోకొచ్చినా పేద, మధ్యతరగతి ప్రజలకు అందని ద్రాక్షగా మిగులుతుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. దీనిపై ప్రజాసంఘాలు, వామపక్షాలు, ప్రధానంగా సిపిఎం వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహిస్తోంది. కలెక్టరేట్‌పై వివాదానికి కారకులైన నేతలుగాని, తన నియోజకవర్గంలో చేపడుతున్న మెడికల్ కళాశాల ప్రయివేటీకరణపై అక్కడి మంత్రి నిమ్మల రామానాయుడుగాని ఇప్పటి వరకూ స్పందించలేదు. ఇప్పటికైనా ఆయా పాలకులు స్పందించి మెడికల్ కళాశాలను ప్రభుత్వ అధీనంలోనే నిర్మించి నిర్వహించాలని జిల్లావాసులంతా ముక్తకంఠంతో కోరుతున్నారు. లేనిపక్షంలో అటు ఆయుధ డిపో ఏర్పాటు, ఇటు మెడికల్ కళాశాల ప్రయివేటీకరణపై జిల్లావాసుల్లో నెలకొన్న అలజడి ఆందోళనరూపంలోకి మారితే కచ్చితంగా కూటమి ప్రభుత్వానికి నష్టమేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్, ఏలూరు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలపై గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్‌కుమార్‌కు శనివారం సాయంత్రం రైతులు వినతిపత్రం అందించారు. తమ సమస్యలను ఎంపీకి వివరించగా హైవే అథారిటీ అధికారులతో రైతుల సమక్షంలో మాట్లాడి కొన్ని సమస్యల పరిష్కారానికి ఎంపీ ఆదేశాలు ఇచ్చారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని కోరారు. సర్వీస్ రోడ్ల నిర్మాణం చేయకపోవడం వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఇబ్బందులు పూర్తిగా పరిష్కారమయ్యేలా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు, కంచర్ల శ్రీనివాసరావు, వందనపు సాయిబాబా, పలువురు రైతులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు మండలం పాత రావిచర్ల గ్రామానికి చెందిన ఎస్.రమాదేవి ఇల్లు ఇటీవల విద్యుత్ ప్రమాదంలో కాలిబూడిదైంది. విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి బాధిత కుటుంబ సభ్యులకు గతంలో తాను ఇచ్చిన మాట ప్రకారం తన సొంత నగదు రూ.ఐదు వేల నగదు టిడిపి మండలాధ్యక్షులు వై,వాసు, టిడిపి నాయకులు అది తదితర నాయకులు కలిసి అందించారు. వారి కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి వర్చ్యువల్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ టి.సాయిబాబా హెచ్చరించారు. మండలంలోని మర్రిగూడెం పంచాయతీలోని లంకాలపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా రాష్ట్రానికి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న నేపథ్యంలో లంకాలపల్లిలో చెక్ పోస్టు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పంట నష్టం అంచనా విధానంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - ముసునూరు

పకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నష్టపరిహారం ఇచ్చే సమయంలో పంట నష్టం అంచనా విధానంపై అవగాహన కలిగి ఉండాలని డివిజన్ సహాయ గణాంక అధికారి సుప్రియ తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి ఆధ్వర్యంలో వ్యవసాయ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రియ మాట్లాడుతూ పంట నష్టం పరిహారం, గణాంక వివరాలపై అవగాహన కల్పించారు.

బాలికకు సైకిల్ అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని పదో వార్డులో జికె ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గణిత ఆనంద ప్రసాద్ గృహం వద్ద ట్రస్ట్ ఆవిర్భావం తర్వాత రెండో సేవా కార్యక్రమం పదో వార్డ్ కౌన్సిలర్ తెలగారపు జ్యోతి, ట్రస్ట్ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో శనివారం నిర్వహించారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న కోట్ల వైష్ణవికి గణిత ఆనంద ప్రసాద్ మిత్రులు ఒడుపు రామాంజనేయులు వారి సతీమణి నాగమణి జ్ఞాపకార్థం వారి వ్యక్తిగత వితరణతో సైకిల్ అందించారు.

సంతకాల సేకరణ

ఏలూరు సిటీ : ఓటర్ల జాబితాలో జరిగిన అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో ఏలూరు అగ్రహారం, పదో డివిజన్‌లో ఎస్‌బిఐ, దొంగల మండపం, అంబికా సెంటర్ తదితర ప్రాంతాల్లో సంతకాలు సేకరించారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారని రామ్మోహన్‌రావు అన్నారు. కొమ్మన సాంబశివరావు, ప్రతాప సుబ్రహ్మణ్యశర్మ, సేవాదళ్ సుబ్బారావు, వై.నాగేంద్ర, సాల్మన్‌రాజు, ఆకుల వెంకన్న, కెఎస్ఎన్.మూర్తి పాల్గొన్నారు.

ఆదికర్మ యోగి అభియాన్‌తో గిరిజన గ్రామాలాభివృద్ధి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఆదికర్మ యోగి అభియాన్‌తో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. మండలంలోని రాజానగరం ఆదిసేవా కేంద్రంలో శనివారం ఆది కర్మయోగి అభియాన్ గిరిజన గ్రామస్తులను భాగస్వామ్యం చేస్తూ విలేజీ విజన్ మ్యాప్, విలేజ్ యాక్షన్ ప్లాన్‌పై ఐటిడిఎ పిఒ, ఆర్‌డిఒ జిల్లా, మండల వివిధ శాఖల అధికారులతో మండలాల వారీగా కలెక్టరు కె.వెట్రిసెల్వి సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జనాభాకు అనుగుణంగా కావాల్సిన అభివృద్ధి, విద్య, వైద్యం, గృహ నిర్మాణాలు, ఇంటి స్థలాలు, వివిధ రకాల సామాజిక పింఛన్లు, స్వచ్ఛమైన రక్షిత మంచినీటిని రెండుపూటలూ పుష్కలంగా అందించేలా ఇంటింటికి కుళాయి ట్యాప్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్లు, డ్రెయిన్లు, రహదారులు, వ్యవసాయం, హార్టికల్చర్, సెరీకల్చర్, ఆక్వా, పరిశ్రమలు, ఆడపిల్లలను అల్లరిపెట్టే అకతాయల జాబితా, తదితర పూర్తి స్థాయి నివేదికలు, అంశాలపై కలెక్టర్ సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం ఆదిసేవా కేంద్ర ఆవరణలో జిల్లా కలెక్టరు మొక్కను నాటారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, ఆర్‌డిఒ ఎంవి.రమణ, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ ఎన్.శ్రీవిద్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పిజె.అమృతం, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ విశ్వ మోహన్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ పి.శారద, జిల్లా పంచాయతీ రాజ్ ఎస్ఇ జెడ్.రమేష్, డివిజనల్ పంచాయతీ అధికారి ఎవి.సుబ్బరాయన్, గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.కన్నపరాజు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరత లేకుండా చర్యలు

ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు

ప్రజాశక్తి - భీమడోలు



మాట్లాడుతున్న గన్ని వీరాంజనేయులు

యూరియా కొరత లేదని, కొన్నిచోట్ల ఏవైనా ఇబ్బందులు ఉంటే సహకార సంఘాల ద్వారా డిమాండ్ మేరకు యూరియాను వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుని సరఫరా చేసి సమస్యను అధిగమిస్తున్నామని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. భీమడోలు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపిడిఒ పద్మావతి దేవి పర్యవేక్షణలో ఎంపిపి కనమాల రామయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆప్కాబ్ ఛైర్మన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమడోలు రైతు సేవా సహకార సంఘ పరిధిలో యూరియా కొరత ఉందని ఆరోపిస్తున్న వారు సమస్యను ఎదుర్కొంటున్న రైతుల వివరాలు తెలియజేస్తే వారికి తక్షణమే యూరియా అందిస్తామని హామీ ఇచ్చారు. భీమడోలు బైపాస్ రోడ్డు, జాతీయ రహదారి నుంచి లింగంపాడు వరకు ఉన్న రోడ్డు మరమ్మతుల విషయమై కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. దాతల సహకారంతో ఏలూరు కాలువపై గుండుగొలను, నారాయణపురం వద్ద ఉన్న వంతెనల పున:నిర్మాణం మరమ్మతు పనులు పూర్తిగా అవటం పట్ల దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎంపిపి రామయ్య మాట్లాడుతూ కొన్ని ప్రభుత్వ భవనాలకు, ఇతరాలకు మరమ్మతులు చేసేందుకు నిధులను నేరుగా మండల పరిషత్‌కు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆప్కాబ్ ఛైర్మన్‌ను కోరారు. తహశీల్దార్ రమాదేవి మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందరికీ అందించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్దిరాజు, కొండబాబు, ఎఎంసి ఛైర్మన్ గిరి పాల్గొన్నారు.

పొగాకు రైతులకు అండగా ఉంటా

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

జంగారెడ్డిగూడెం : పొగాకు రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో పొగాకు బోర్డులో రైతులను ఆయన శనివారం కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పొగాకు బోర్డు సమస్యల పరిష్కారానికి, రైతుల సమస్యలను కేంద్రానికి, బోర్డు అధికారులకు చేరవేయడం పట్ల ఎంపీ మహేష్ కుమార్ ఎంతగానో కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తాను ఎంపీనే కాకుండా ఈ పొగాకు బోర్డు మెంబర్‌గా ఉన్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. రైతుల కోసం తాను నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. రైతులు పొగాకు ఒకటే కాకుండా పామాయిల్ కూడా పండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దుర్గాపార్వతి, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, టిడిపి కూటమి నాయకులు, పలువురు రైతు సంఘాల నాయకులు, పొగాకు సాగుదారులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న ఆర్‌జియుకెటి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి సమగ్ర విద్య, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా మరో ముందడుగు వేసింది. శనివారం రెండు ముఖ్యమైన అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. మొదటి ఒప్పందాన్ని ప్రముఖ విద్యా వేదిక ఫిజిక్స్ వాల్లా లిమిటెడ్‌తో కుదుర్చుకున్నారు. రెండో ఒప్పందాన్ని కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్‌తో కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్‌జియుకెటి ఛాన్సలర్ ఆచార్య మధుమూర్తి, వైస్ ఛాన్సలర్ ఆచార్య విజయకుమార్, రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ది అడ్వకేట్ బార్ అసోసియేషన్ జంగారెడ్డిగూడెం మాజీ అధ్యక్షులు సీనియర్ న్యాయవాది తాతవోలు సూర్యనారాయణమూర్తి ఈ నెల 13వ తేదీన మృతి చెందారు. ప్రస్తుత బార్ అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి ఆధ్వర్యంలో న్యాయవాదుల నుంచి సేకరించిన రూ.1,59,500 సూర్యనారాయణమూర్తి కుటుంబసభ్యులకు సహకారంగా అందించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు మూర్తి మాట్లాడుతూ బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎవరైనా సరే చనిపోతే వారి కుటుంబానికి ఆర్థిక సహాయ చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మానికల సూరిబాబు, సిహెచ్‌డివి.కోటేశ్వరరావు, కాపుదాసు వెంకటేశ్వరరావు, సొబ్బన ఆనందరావు, మాండ్రు వరప్రసాద్, పొన్నా లక్ష్మణరావు, ఆచారి బుడిగిన నాగేంద్రకుమార్, పివి.కృష్ణారెడ్డి, వింజమూరి కిరణ్, కిషోర్, భాషా, శ్యాంబాబు, జువ్వాల బాబ్జి, న్యాయవాదులు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ముదినేపల్లిలో 'చేయి చేయి కలుపుదాం.. అమరావతి నిర్మిద్దాం'

ప్రజాశక్తి - ముదినేపల్లి

చేయి చేయి కలుపుదాం.. అమరావతి నిర్మిద్దాం కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ యద్దనపూడి రామకృష్ణ మాట్లాడుతూ చిన్నతనంలోనే రాష్ట్రానికి, రాజధానికి తన వంతుగా సాయం అందించడమే కాకుండా అందరిని భాగస్వాములను చేయడం అభినందనీయమన్నారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి చేపట్టిన కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పంచాయతీ కార్యదర్శులను, సచివాలయ ఉద్యోగులను కోరారు. తమ వంతు సాయం అందిద్దామన్న, ఎలా చేయాలో తెలియక వెనకడుగు వేస్తున్నారని, ఈ కార్యక్రమం ద్వారా సులభంగా నేరుగా సిఆర్‌డిఎ ఖాతాకే మన విరాళాన్ని అందించవచ్చని చెప్పారు. డిప్యూటీ ఎంపిడిఒ బి.అశోక్ మాట్లాడుతూ కేవలం చిన్న సాయం ద్వారా రాజధాని అభివృద్ధిలో భాగస్వాములయ్యే అవకాశం లభించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రూ.116 పది రెట్లు పెంచి తనవంతు సాయం అందిస్తున్నానన్నారు. అనంతరం ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒను వైద్యులు అంబుల మనోజ్ శాలువాలతో సత్కరించారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎంవి.రమణరావు, జూనియర్ అసిస్టెంట్ సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది ద్వారా స్కానర్ ద్వారా విరాళం నగదును సిఆర్‌డిఎ ఖాతాకు పంపించారు.

ఎంపీకి యాదవ సంఘం సత్కారం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌ను యాదవులు సత్కరించారు. శనివారం ఉదయం జంగారెడ్డిగూడెం పర్యటనకు వెళ్తూ మార్గమధ్యలో ద్వారకాతిరుమల వచ్చిన ఎంపీకి యాదవ్ కళ్యాణమండపంలో యాదవ సంఘం తరపున ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్‌కుమార్ ద్వారకాతిరుమలలోని కళ్యాణ మండపం ఆధునీకరణ పనులకు రూ.కోటి మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ముమ్మిడి చింతయ్య, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ మహేష్, కంపసాటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్ ప్రసాద్ కాంస్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వం ప్రజలకు అందించే పథకాల అమలులో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర కీలకమని, అలాంటి రెవెన్యూ ఉద్యోగులు ప్రజలకు మరింత చేరువయ్యేలా పని చేయాలని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. రెవిన్యూ సర్వీసెస్ తొలి తరం నాయకులు, మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతి సందర్భంగా స్థానిక రెవెన్యూ భవన్ వద్ద ఏర్పాటు చేసిన తోట సుధాకర్ ప్రసాద్ కాంస్య విగ్రహాన్ని శనివారం బొప్పరాజు ఆవిష్కరించారు. అనంతరం తోట సుధాకర్ ప్రసాద్ భార్య తోట కామాక్షి రచించిన సుధాకర్ ప్రసాద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, ఏలూరు జిల్లా అధ్యక్షులు కె.రమేష్‌కుమార్, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు ఎస్.శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి నాగబాబును కలిసిన ఎంఎల్ఎ బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జనసేన పార్టీ నుంచి ఎంఎల్‌సిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కొణిదెల నాగబాబును క్యాంపు కార్యాలయంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించి పలు అంశాలను చర్చించినట్లు తెలిపారు.

నోటీసు

ప.గో.జిల్లా, నరసాపురం టౌన్
Sri Siddardha AutoConsultancy
174 of 2019 (రిజిస్టర్డ్ ఫర్మ్) ను రద్దు చేయుచున్నాము. అభ్యంతరాలు ఉన్నచో 15 రోజుల లోపు తెలుపవలెను.

మేనేజింగ్ పార్ట్‌నర్
90635 95155
99481 89240

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, జుత్తిగ గ్రామానికి చెందిన **కొప్పనాతి లక్ష్మి**, W/o. రాంబాబు అను నేను తెలుపుకొనేది. నేను స్వంత పని నిమిత్తం ది. 20-09-2025 శనివారం నాడు ఆలమూరు గ్రామం నుండి ఆటోలో వస్తుండగా పాస్‌పోర్ట్, ఫోన్, నగదు ఉన్న నా హ్యాండ్ బ్యాగ్ పడిపోయింది. నా యొక్క **పాస్‌పోర్ట్ నెం: S8822636** అయి ఉన్నది. ఈ పాస్‌పోర్ట్ దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

కొప్పనాతి లక్ష్మి,
W/o. రాంబాబు,
డోర్ నెం. 1-261/2,
పల్లిపాలెం, జుత్తిగ (Post),
పెనుమంట్ర (మం), ప.గో. జిల్లా
సెల్ నెం: 99665 27121